క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు: ఎమ్మెల్యే



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. ఆమె శుక్రవారం పలువురు లబ్ధిదారులకు పథకం చెక్కులు అందజేశారు. ఆమె వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు శేఖర్, సత్యంగౌడ్, భిక్షపతి, నర్సింలు, ప్రసాద్, జీవన్‌రెడ్డి, విఠల్, రాంచందర్ ఉన్నారు.

ఆహ్వానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని రాయగిరి వేంకటేశ్వరాస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా ఈనెల 30 నుంచి జరిగే జాతరకు రావాలని ఎమ్మెల్యే సునీతారెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు శుక్రవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రాజేందర్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, గ్రామస్తులు అశోక్, రాములు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విఠల్‌రెడ్డి



అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం జూనియర్ సివిల్, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్‌కు శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పీ.జె విఠల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా లింగమయ్య, శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి వెంకటకృష్ణ, కోశాధికారి ప్రభులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వెంకట్రామిరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎస్సీ పదవీ కేటాయించాలి

రామాయంపేట(మెదక్): రాష్ట్ర ప్రభుత్వం మంత్రి వర్గ విస్తరణలో మాదిగలకు ఎస్సీ పదవీ కేటాయించాలని శుక్రవారం మెదక్ జిల్లా మాదిగ జేఏసీ అధ్యక్షుడు రమేశ్ అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి వర్గ విస్తరణలో మాదిగ కులాలకు మంత్రి పదవి కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌ను కోరారు. మంత్రివర్గ విస్తరణ నియామకాల్లో ఎస్సీ మాదిగలకు సముచిత స్థానం కల్పించాలన్నారు.

వైభవంగా దుర్గమ్మ బోనాలు



బోనాల ఊరేగింపులో భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని దుర్గమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలను మహిళలు ఊరేగించి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించారు.

జంక్‌ఫుడ్‌తో సమస్యలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నర్సాపూర్ రూరల్: జంక్‌ఫుడ్ తినడం వల్ల జీర్ణకోశ సంబంధిత వ్యాధులు వస్తాయని రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు కిరణ్ అన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లిలో శుక్రవారం నర్సాపూర్ డిగ్రీ కళాశాల ఎస్ఎస్ఎస్ శిబిరం-1 విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలన్నారు. యువత మద్యపానం, గుట్కా, సెల్‌ఫోన్, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు రాహుల్, ప్రోగ్రాం అధికారి సురేష్‌కుమార్, శ్రీనివాస్, రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లాదుర్గం డీఈగా ప్రభాకర్



అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం పంచాయతీరాజ్ సబ్ డివిజన్ డీఈగా ప్రభాకర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో డీఈగా విధులు నిర్వహించిన శివప్రసాద్ దీర్ఘకాలిక సెలవులపై వెళ్లడంతో కామారెడ్డి జిల్లా పిట్లం డీఈగా పని చేస్తున్న ప్రభాకర్ అల్లాదుర్గం కు బదిలీపై వచ్చారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో హోమియో వైద్యం

- పెరుగుతున్న అవుట్ పేషెంట్లు
- అందుబాటులో మూడు వందల రకాల మందులు



హోమియో వైద్య సేవలు అందిస్తున్న చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 15 ఏళ్లుగా హోమియోపతి వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. చేగుంటలో హోమియో వైద్య సేవలను ప్రారంభించిన సమయంలో ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేక పోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఒక గదిని హోమియో వైద్యసేవల కోసం కేటాయించారు. అప్పటినుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే హోమియోపతికి సంబంధించిన వైద్య సేవలను అందిస్తున్నారు. గతంలో రోజుకు ఐదు నుంచి పది మంది మాత్రమే హోమియో వైద్యం కోసం వస్తుండేవారు. ఏడాది కాలంగా చేగుంటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం కోసం వచ్చే పేషెంట్ల సంఖ్య పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం ప్రతీరోజు సగటున 30 మందికి పైగా పేషెంట్లు హోమియో వైద్యం కోసం వస్తున్నారు. కీళ్లు, ఫైల్స్, కిడ్నీ, చర్మ, అస్తమాకు సంబంధించిన సమస్యలకు హోమియోపతిలో మందులు వాడితే శాశ్వత పరిష్కారం కలుగుతుందని చాలా మంది నమ్మకం. ఉమ్మడి మెదక్ జిల్లాలో చేగుంటతో పాటు పాపన్నపేట, శివ్వంపేట, మనోహరాబాద్, గడిపెద్దాపూర్, ఇబ్రహీంపూర్‌లో ప్రభుత్వ హోమియో వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. హోమియో వైద్యసేవలకు సంబంధించి తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రి ఆయుష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో సేవలు కొనసాగుతాయన్నారు. హోమియో మందుల కోసం సిద్దిపేట, దుబ్బాక, మెదక్, నారాయణ్‌ఖేడ్, కామారెడ్డి తదితర ప్రాంతాల నుంచి పేషెంట్లు వస్తుంటారు.



ఆస్పత్రిలో ఉన్న హోమియో మందులు

దూర ప్రాంతాల నుంచి వస్తున్నారు



చేగుంట హోమియో వైద్యశాలలో ప్రస్తుతం మూడు వందలకు పైగా మందులు అందుబాటులో ఉన్నాయి. ఏడాదికాలంగా అవుట్ పేషెంట్ల సంఖ్య ఎక్కువగా పెరిగింది. మందుల కోసం దూర ప్రాంతాలకు చెందిన వారు సైతం వస్తున్నారు. కొన్ని రకాల సమస్యలకు హోమియో మందులతో శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.

– మృదుల, హోమియో వైద్యురాలు, చేగుంట

అదనపు భవనాన్ని నిర్మించాలి



ప్రస్తుతం చేగుంట ప్రభుత్వ ఆస్పత్రిలో కొనసాగుతున్న హోమియో వైద్య సేవలకోసం అదనపు గదులను నిర్మించాలి. ఇటీవల జిల్లా కలెక్టర్ ఆస్పత్రి సందర్శించినప్పుడు అదనపు గదుల అవసరం గురించి వివరించాం. అదనపు గదులు ఉంటే హోమియోపతికి సంబంధించిన మరిన్ని కొత్త మందులు సైతం తీసుకొస్తాం.

– అనిల్‌కుమార్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, చేగుంట

చండీకాంబ ఆలయంలో సీసీ కెమెరా ధ్వంసం



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోపి చండీ గ్రామంలో కొలువైన చండీకాంబ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడేందుకు వచ్చి విఫలయత్నం చెందారు. గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతో పాటు గర్భాలయంలోకి ప్రవేశించేందుకు ఏర్పాటు చేసిన ఇనుప గేట్ల తాళాలను పగులగొట్టి లోనికి వెళ్లారు. ఆలయంలో ఎలాంటి ఆభరణాలు, వస్తువులు లేకపోవడంతో వెనుతిరిగారు. రెండేళ్ల కాలంలో ఐదు సార్లు ఆలయంలో చోరీకి పాల్పడి హుండీలు ఎత్తుకెళ్లిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో ఆలయ నిర్వాహకులు హుండీని తొలగించారు. ప్రత్యేక పూజల రోజున అమ్మవారికి సంబంధించిన ఆభరణాలు అలంకరించి తిరిగి తీసుకెళ్లి బ్యాంకులో డిపాజిట్ చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని పోలీసులు, క్యూస్ టీం సందర్శించారు.

గ్రామస్తుల నిరసన

చండీకాంబ ఆలయంలో చోరీకి పాల్పడుతున్న వారిని గుర్తించడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని గ్రామస్తులు ఆలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. వరుసగా గుర్తుతెలియని వ్యక్తులు హుండీతో పాటు పలు వస్తువులు చోరీ చేసినప్పటికీ వారిని గుర్తించడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు నర్సారెడ్డి, రామస్వామిగౌడ్, కుమార్‌గౌడ్, అనీల్, మహేందర్‌రెడ్డి, దేవయ్య, పాపిరెడ్డిలు ఆరోపించారు. చోరీల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని సైతం ధ్వంసం చేస్తున్నారన్నారు.

ప్రశ్నించేతత్వం పెరగాలి



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సభ్యులు ప్రశ్నించేతత్వం అలవర్చుకుంటే సొసైటీని మరింత అభివృద్ధి చేయవచ్చని సొసైటీ చైర్మన్ తిరుమల అనంతరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన అధ్యక్షతన శుక్రవారం సొసైటీలో వార్షిక మహాజనసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత యేడాదికి సంబంధించిన ఆడిట్ ఆమోదించడంతో పాటు 2024–25కు సంబంధించిన బడ్జెట్ వివరాలపై డైరెక్టర్లు చర్చించారు. గత సంవత్సరం సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ రకాల వ్యాపారం, సేవలకు గాను సొసైటీకి మంచి ఆదాయం వచ్చినట్లు చైర్మన్ అనంతరెడ్డి అన్నారు. డైరెక్టర్లు, సిబ్బంది, రైతుల సహకారంతో సొసైటీ అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. సమావేశంలో సొసైటీ సీఈఓ సిద్ధయ్య, వైస్ చైర్మన్ మురళి డైరెక్టర్లు నర్సింలు, సత్యనారాయణ, అమృత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పశుగణన

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం పశుగణన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి నిజాం హుస్సేన్ మాట్లాడుతూ.. రైతులు తమ పశువుల వివరాలను పశువైద్య సిబ్బంది వద్ద నమోదు చేయించాలని సూచించారు.

సమష్టి కృషితోనే పీఏసీఎస్ అభివృద్ధి

సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ ధర్మారెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు, పీఏసీఎస్ సిబ్బంది, పాలకవర్గం సమష్టి కృషి చేస్తేనే పీఏసీఎస్ ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని సొసైటీ చైర్మన్ ధర్మారెడ్డి అన్నారు. మండల పరిధిలో గల ఏకైక పీఏసీఎస్ సోమక్కపేట్‌లో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి, సీఈఓ పోచయ్యలు మాట్లాడుతూ ప్రస్తుతం సహ కార కేంద్రం లాభాలలోనే ఉందన్నారు. శీలాంపల్లి గేటు వద్ద రూ. 40 లక్షలతో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపుతో తీవ్రంగా నష్టపోయామన్నారు. ప్రస్తుతం దానిని పునః ప్రారంభించే యత్నం చేస్తున్నామన్నారు. గత సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లతో వచ్చిన ఆదాయాన్ని సిబ్బంది వేతనాలు, కేంద్రం నిర్వహ ణకు వినియోగిస్తున్నామన్నారు. త్వరలో ప్రారంభమయ్యే ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకుంటామన్నారు. సమావేశంలో రైతులు తమ సమస్యలను సొసైటీ పాలకవర్గ సిబ్బందికి తెలియజేసి, పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, సీఈఓ పోచయ్య, సిబ్బంది నర్సింలు, రాజు, దత్తు, రైతులు పాల్గొన్నారు.

చిరుసంచుల వరిసాగుతో అధిక దిగుబడి

సంగుపేట ఏరువాక శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ



చందూర్‌లో రైతు చంద్రశేఖర్‌రెడ్డి వరిసాగును పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు రాహుల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతుల ఆసక్తితోనే చిరుసంచుల సాగుతో అధిక దిగుబడి వస్తుందని సంగుపేట ఏరువాక శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని చందూర్ గ్రామానికి చెందిన చౌటకూరి చంద్రశేఖర్‌రెడ్డికి అందించిన పలురకాల సన్నరకం చిరుసంచుల వరిసాగును పరిశీలించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. చంద్రశేఖర్‌రెడ్డికి అందించిన కంపసాగర్- 10329 అనే రకం ప్రస్తుతం చాలా బాగుందన్నారు. ఈ రకం కంకిలో 240 నుంచి 250 గింజలుంటాయన్నారు. ఈ రకం సాగు అగ్గితెగులు, సుడిదోమను తట్టుకునే రకం అన్నారు. ఎంటీయూ 1010. కేఎన్ఎం 118 లకు సమానంగా దిగుబడి ఇచ్చే రకమని, పంట వ్యవధి 120 రోజులన్నారు. కాగా రైతు చంద్రశేఖర్ మా శాస్త్రవేత్తల నమ్మకంతో ఆ చిరుసంచుల విత్తనాల వరిసాగు చేయడం హర్షణీ యమన్నారు. కార్యక్రమంలో ఏరువాక శాస్త్రవేత్తలు శ్రీకాంత్, ఆకాశ్, రైతు చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్ మిశ్రా



దొంతిలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అజయ్ మిశ్రా

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామీణ ప్రజల కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్,రిటైర్డ్ ఐపీఎస్ అధికారి అజయ్ మిశ్రా అన్నారు. శుక్రవారం మండలంలోని దొంతిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వివిధ రకాల రక్తపరీక్షలు నిర్వహించడంతో పాటు మెరుగైన చికిత్సల కోసం వివరించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన్ గ్రామీణ అభివృద్ధి సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతారావు, గ్రామస్తులు ఫణిశశాంక్ శర్మ, శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మీసేవ నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

కొల్చారం(నర్సాపూర్): మీసేవ కేంద్రాలకు అవసరమైన ధ్రువపత్రాల దరఖాస్తు కోసం వెళితే నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారంటూ శుక్రవారం పలువురు దరఖాస్తుదారులు తహసీల్దార్ గఫార్ మియాకు ఫిర్యాదు చేశారు. రాజీవ్ యువశక్తి పథకం కోసం అవసరమైన కుల, ఆదాయ, స్థానిక ధ్రువపత్రాల కోసం మీసేవ నిర్వాహకులు నిబంధన మేరకు ఒక్కో దరఖాస్తుకు రూ.45 తీసుకోవాల్సి ఉండగా, మూడింటికీ కలిపి రూ.200లు వసూలు చేస్తూ నిరుపేదలను దోచుకుంటున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో రుసుము రూపంలో డబ్బులు వసూలు చేస్తున్న నిర్వాహకులపై దర్యాప్తు చేసి, సెంటర్లను మూసివేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు మూడు రోజుల నుంచి దరఖాస్తు చేసుకున్న సర్వర్ పని చేయడంలేదన్నారు. ఈ విషయమై తహసీల్దార్ మాట్లాడుతూ.. దరఖాస్తు చేయగా వచ్చిన రిసిప్ట్‌పై ఉన్న డబ్బులు మాత్రమే చెల్లించాలని, అధిక డబ్బులు అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

గేదెలకు మేతగా వరి పంట

చిలప్‌చెడ్(నర్సాపూర్): వరి పంట చేతికి వచ్చే సమయానికి సాగు నీరు అందకపోవడంతో పంట ఎండిపోయింది. దీంతో ఆవేదనకు గురైన రైతు తాను పండించిన వరి పంటను శుక్రవారం గేదెలకు మేతగా వదిలేశాడు. మండల పరిధిలోని సోమక్కపేట్ గ్రామానికి చెందిన రైతు బెస్త లక్ష్మణ్ నాలుగు ఎకరాలు వరి సాగు బోరు బావి సహాయంతో చేశాడు. పంట చేతికి వచ్చే సమయానికి భూగర్భజలాలు అడుగంటి, బోరు తక్కువ పోయడంతో కనీసం రెండు ఎకరాలైనా కాపాడుకునే ప్రయత్నం ఉన్నాడు. ఎండిన మరో పొలాన్ని గేదెలకు మేతగా వదిలేశాడు.



సోమక్కపేట్‌లో గేదెలు మేస్తున్న వరి పంట

ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలి

ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రజలంతా కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి పెద్దశంకరంపేటలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధు, నాయకులు నారాగౌడ్, మాజీ ఎంపీపీ రాజు, సత్యనారాయణ, రాజేందర్‌గౌడ్, సంగమేశ్వర్, గంగారెడ్డి, పండరి, జహంగీర్, సలీం, భానుగౌడ్, యాదుల్ తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కొనసాగుతున్న రిలేదీక్షలు

నర్సాపూర్: డంప్‌యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారం 38వ రోజుకు చేరాయి. దీక్షలో కుర్మ సంఘం ప్రతినిధులు జేఏసీ నాయకుడు రాజేందర్, కుర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ పాల్గొన్నారు. దీక్షలో సంఘం సభ్యులు భాస్కర్, ఆంజనేయులు, మల్లేశ్, ఆనంద్, సాయి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ పాఠశాలకు ల్యాప్‌టాప్ బహూకరణ

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట ఉన్నత పాఠశాలకు సుగునరాయ్ ఎడ్యూకేషనల్ సొసైటీ తరఫున ల్యాప్‌టాప్ అందజేశారని హెచ్ఎం ధర్మపురి, సీనియర్ ఉపాధ్యాయుడు రంగారెడ్డి తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం ల్యాప్‌టాప్ అందజేయడంపై సంస్థ నిర్వాహకులు రామలక్ష్మమ్మ, డా. శ్రీకాంత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ కాళ్లకల్ పెద్దమ్మ ఆలయానికి విరాళం



మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ పెద్దమ్మ ఆలయ అభివృద్ధి కోసం బీజేపీ నాయకుడు యాదగిరి దంపతులు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ. 1,00,116లను శుక్రవారం ముదిరాజ్ సంఘానికి అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మల్లేశ్, మాజీ సర్పంచ్ మల్లేశ్, నరేష్, శ్రీశైలం, నాగరాజు, రాజు, నరేష్ తదితరులున్నారు.

◆ సీహెచ్‌సీకి వీల్‌చేర్ పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి మెదక్‌కు చెందిన శ్రీసాయి మహాలక్ష్మి జూవెలర్స్ యజమాని సీహెచ్ సురేష్ శుక్రవారం వీల్‌చేర్‌ను అందజేశారు. రోగుల సౌకర్యం కోసం వీల్‌చేర్ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వెంకటలక్ష్మి, పీహెచ్‌సీ డాక్టర్ ఫెర్నాజ్, సీహెచ్‌ఓ ఎలిజబెత్‌రాణి, ఏఎన్ఎం శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

◆ పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

పెద్దశంకరంపేట(మెదక్): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నగేష్ షెట్కార్, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్‌లోని ఎంపీ కార్యాలయంలో మండలంలోని గొట్టిముక్కుల గ్రామానికి చెందిన బూదెమ్మకు ఆస్పత్రి ఖర్చుల కోసం మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును వారు అందజేశారు. ప్రజల ఆరోగ్యానికి సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జహంగీర్, యూత్ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు భానుగౌడ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

◆ పెండింగ్ బిల్లులపై పోస్టుకార్డ్ ఉద్యమం

మనోహరాబాద్(తూప్రాన్): తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ హయాంలో మాజీ సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఎంకు పోస్టుకార్డ్ ఉద్యమం చేపట్టినట్లు రాష్ట్ర సర్పంచ్ ఫోరం వర్కింగ్ ఉపాధ్యక్షుడు మల్లేశ్ తెలిపారు. శుక్రవారం తెలంగాణ వ్యాప్తంగా తాజా మాజీ సర్పంచ్‌లు పోస్టుకార్డు ద్వారా తమ సమస్యలపై ఉద్యమం చేపట్టి సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించుకున్నట్లు తెలిపారు.

◆ వైన్స్ దుకాణాల తనిఖీ



నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని రెండు వైన్స్‌లను రామాయంపేట ఎక్సైజ్ సీఐ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు మద్యం షాపులో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే మద్యం అమ్మకాలు జరపాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ సిద్దార్థ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ ఆన్‌లైన్ బెట్టింగ్‌ల జోలికి వెళ్లొద్దు

పాపన్నపేట(మెదక్): ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమ్‌ల జోలికి వెళ్లొద్దని పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న వేళ కొంత మంది యువకులు బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలుస్తుందన్నారు. అనవసరంగా బెట్టింగ్‌ల జోలికి వెళ్లి, అప్పుల పాలై చివరకు ప్రాణాలు తీసుకునే పరిస్థితి తెచ్చుకోవద్దన్నారు. క్రికెట్‌ను ఆటగానే భావించి, ఆనందించాలని, వ్యాపారంగా మార్చొద్దని సూచించారు.

◆ కళ్యాణలక్ష్మి చెక్కులు ఇవ్వరా..?

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలానికి రెండు నెలల క్రితం ముజూరైన 45 కల్యాణలక్ష్మి చెక్కులు ఇవ్వరా అని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. శుక్రవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి చెక్కులను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా అందిస్తామని బదిలీ అయిన తహసీల్దార్ ముసాద్దీక్ తెలిపారు. ప్రొటోకాల్ రగడతో ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసి, రెండు నెలలు గడుస్తున్నా చెక్కులను మాత్రం లబ్ధిదారులకు ఇవ్వడంలేదన్నారు.

◆ అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తు ఉగాది, రంజాన్ వేడుకలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని నాల్గవ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ రజియసుల్తాన ఆధ్వర్యంలో ముందస్తుగా ఉగాది, రంజాన్ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల మాజీ ఎస్ఎంసీ చైర్మన్ జగన్, పిల్లలు, మహిళలు పాల్గొన్నారు.

◆ హలో బీసీ చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

రామాయంపేట(మెదక్): తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బీసీ రిజర్వేషన్ 42కు పెంచుతూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన చట్టాన్ని కేంద్రం ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు మెట్టు గంగారం, పోచమ్మల గణేశ్, దామోదర్, సిద్ధరాములు, ఉమామహేశ్వర్, భూమా కిషన్, రాము, వెంకట్, నరేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

◆ చలివేంద్రం ప్రారంభం

నర్సాపూర్: పట్టణానికి చెందిన నర్సింహరెడ్డి, సంతోష్‌కుమార్ జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రారంభించారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ రమ్యశ్రీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామానికి చెందిన మెసయ్య జ్ఞాపకార్థంగా వారి కుమారుడు నాగరాజు చలివేంద్రం ఏర్పాటు చేశారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్ చలివేంద్రాన్ని ప్రారంభించారు.

◆ అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి తహసీల్దార్ సింధుజ అన్నారు. మండల పరిధిలోని చండూర్ గ్రామంలో సర్వే నెంబర్-2 అసైన్డ్ భూమిలో పలువురు వ్యక్తులు అక్రమంగా నిర్మించిన ఇళ్లు, రేకుల షెడ్లు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించడంతో వాటిని గుర్తించిన రెవెన్యూ సిబ్బంది శుక్రవారం కూల్చి వేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సునీల్‌సింగ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.